**ఒక పరిస్థితంటూ వచ్చినప్పుడు నోరు ఎత్తలేని, నిలబడలేని సందర్భాలు గుర్తొస్తాయి. వాటివల్ల ఎందరినో బాధపెట్టి వుంటాము. చేయగలిగింది చేయలేకపోతాము. నా జీవితంలో నేను కూడా ఎన్నిసార్లు 'ఎడ్డి'గా ఉండిపోయానో కదా అని సిగ్గవుతుంటుంది.**

పూడూరి రాజిరెడ్డి

# 3 ఎడ్డి

చంద్ర





మనుషులను గురించి నిజమైన ఆసక్తి ఉన్న నా చిన్నతనంలో ఈ ఉదంతం గురించి విన్నాను. జీవితం మీద అలాంటి ఆసక్తిని తిరిగి నెలకొల్పుకోవాలనే కాంక్షతో దీన్ని మీతో పంచుకుంటున్నాను. ఇది ఇలాగే జరిగిందని చెప్పడానికి నా దగ్గర రుజువులు ఏమీలేవు. ఇలా జరిగి ఉంటుందనే ఊహకు దగ్గరగా ఉన్న కథనాన్ని ఎంచుకున్నాను. అదృష్టంకొద్దీ మనకు మనుషులున్నారు, వారి కథలున్నాయి. కానీ ఏ మనిషిని గురించి తలుచుకున్నా అందులో నాకు నేనే కనబడు తుండటం నన్ను బాధపెడుతుంటుంది.

వాకిట్లో అలుకు జల్లుతున్న మణెవ్వ చల్లబోయిన అలుకుముంతను అటే ఆపి బీరిపోయింది. ఇంటి ముందున్న తోవగుండా నడిచి వస్తున్న ముసలవ్వ ఆకారాన్ని కళ్లు విప్పార్చి చూసింది. మణెవ్వను పలకరిస్తున్నట్టుగా ముసలవ్వ ఏదో గొణిగింది. దానికి జవాబు ఇవ్వాలని కూడా తోచక, ఈ వేళగాని వేళ ఆమె ఎలా వచ్చిందా అని వెనగ్గా చీకట్లోకి చూసింది. మోటర్ బండి చప్పుడు కూడా అయినట్టు లేదు. ఆ పల్లెటూరికి ఒక వాహనం రావడం అనేది అరుదే అయినా ఆమెను ఆ సమయంలో దింపగలిగేది మోటర్ బండి మాత్రమే అన్నట్టుగా ఆమె చూపుంది. ఎప్పుడో మాయమైన నవ్వు అప్పుడే వెనక్కి వచ్చినట్టుగా చిన్నగా నవ్వుకొని ముసలవ్వ ముందుకు సాగిపోయింది. మణెవ్వ అలుకు అక్కడే విడిచిపెట్టి ఇంట్లోకి పరుగెత్తింది. నాలుగేళ్ల కింద తప్పిపోయిన రాధవ్వ తిరిగొచ్చిందని కొన్ని క్షణాల్లో ఊళ్లో వ్యాపించబోయే వార్తకు అలా ఆమె తొలి వార్తాహరి అయింది. రాధవ్వ కొద్దిగా కుంటుతూ నడుస్తుందన్నది కూడా మణెవ్వ అదనంగా కనిపెట్టిన విషయం.

తెల్లవారుజాము చీకటి ఇంకా పోకపోయినా, అలవాటైన తోవ వెంబడి మామూలుగానే మెల్లగా ఇంటికి నడుచుకుంటూ పోయింది రాధవ్వ. ఈ నాలుగేళ్లలో ఊరిలో వచ్చిన మార్పులు తన పుట్టిన ఊరిలో తనకు తోవ తెలియనీయనంతటివైతే కావు. కానీ అంతకు ముందు నడకలోని వేగానికీ, ఇప్పటి నడకలోని నెమ్మదితనానికీ

వచ్చిన మార్పు ఆమె వయసుకు మాత్రమే సంబంధించినది కాదు; మొత్తంగానే ఆమె శరీరంలోంచి ఈ నాలుగేళ్లలో ఏదో తెలియనిది మాయమై పోయింది. ఇంక ఈ భూమ్మీద తనకు నూకలు చెల్లిపోయాయనీ, తన ఊరిలో ఇంక ఎప్పటికీ అడుగుపెట్టలేననీ, తనవాళ్లు అంటూ ఎవరూ ఈ లోకంలో లేరనీ నిశ్చయమై పోయిన తర్వాత, రేపటి రోజును దేనికోసం బతకాలో తెలియనప్పుడు ఉండే వైరాగ్యంలోంచి మాత్రమే పుట్టగలిగే తొందరలేనితనం అది.

ఇంటికి ఆనుకునే ఉన్న దొడ్డిలో గొగ్గికాళ్ల మీద కూర్చుని పొద్దుటి పాలు పిండుతున్న భాగ్యవ్వను ఎన్నడూ లేనట్టుగా బర్రె సతాయిస్తుంటే దానితోపాటు మొగుడి మీద కూడా కలిపి యాష్టపడుతోంది. పొలం దున్నడానికి కావాల్సిన నీళ్ల కోసం మబ్బులన్నే భర్త రాటు కొట్టడానికి వెళ్లిపోయాడు. తెల్లవారేలోపు కొడితేగానీ పొలంలో నీళ్లు ఆగవు. అందుకే పాలు పిండే బాధ్యత ఇలాంటి రోజుల్లో ఆమె మీద పడుతుంది. అవి పిండి, మళ్లీ రాటు పూర్తయి భర్త మడిలో నాగలితో దిగేలోగా ఏదన్నా సద్ది పట్టుకెళ్లాలి. అసలే ఆకలికి ఆగే మనిషి కాదు. చంటిదాన్ని లేపి, పొయ్యి ముట్టించమని చెప్పి, ముందు కైకిళ్లు చెప్పి రావాలి. ఆరోజు చేయాల్సిన పనులను మనసులో వరుసగా పేర్చుకుంటూ, నేలమీదినుంచి లేస్తూనే బిడ్డను కేకేయ బోయినదల్లా అటే కట్టెయిపోయింది. వాకిట్లో నిలబడి వుంది రాధవ్వ. అక్కడిదాకా రానైతే వచ్చిందిగానీ సరాసరి ఇంట్లోకి పోవడానికి అంతకుముందున్న స్వతంత్రం ఏదో ఆ ఇంటిమీద పోయినట్టుగా గడప దగ్గర ఆగిపోయింది. ముందు భాగ్యవ్వ నమ్మలేదు. ఆమె తన తల్లి అయివుండదన్న అపనమ్మకం కాదది. తల్లిని బిడ్డ పోల్చుకోలేదా? అలాంటిది ఒకటి జరుగుతుందని ఆమె ఎప్పుడో ఆశ వదిలేసుకుంది. కానీ ఆ తెల్లవారుజామున తల్లి తన ముందు నిలువెల్లా నిలబడేసరికి భాగ్యవ్వ కాళ్లు వణికాయి. చేతిలో ఉన్న పాల సర్వ బరువు ఆగలేదు. ఎన్నాళ్లుగానో లోలోపల ఉన్న బరువును అమాంతం దింపుకున్నట్టుగా సర్వను అక్కడే పెట్టి తల్లి దగ్గరికి ఉరికినంత పనిచేసింది. ముందు ఎవరిమీద ఎవరు పడ్డారో చెప్పడం కష్టం. ఇద్దరూ భోరుమని ఏడవటంలో భాగమైనట్టుగా కట్టేసి వున్న బర్రె కూడా తల తిప్పింది. నాలుగేళ్లుగా చెప్పుకోకుండా ఉన్న ఎన్నో ముచ్చట్లు ఆ కన్నీటిధారల్లో బదిలీ అయినాయి. ఎంతసేపు ఆ ఇద్దరు మహిళలు ఆ స్థితిలో ఉండిపోయారో కొలవడం కష్టం. ఈ భూమ్మీద మానవజాతి ఆవిర్భవించిన తర్వాత అనుభవించిన మహత్తర ఉద్వేగక్షణాల్లో ఆ తల్లీకూతుళ్ల సంగమదృశ్యం ఒకటి. ఆ శోకమే వాడకట్టు

ఆడవాళ్లందరికీ చాటింపులా మారింది. నాలుగేండ్ల కింద 'తిర్పతి'కి పోయినప్పుడు తప్పిపోయిన రాధవ్వ అలా మరోసారి ఊరివాళ్ల నోళ్లల్లో నానింది.

రాధవ్వ ఎన్నడూ ఊరు దాటిన మనిషి కాదు. ఆమెను అదే ఊరిలో ఇచ్చి పెళ్లి చేశారు. కొడుకులు లేకపోవడంతో పుట్టిన ఒక్కగానొక్క బిడ్డకు ఇల్లరికం పెట్టుకుంది. ఉన్నన్ని రోజులూ ఏవైనా పొరుగూళ్ల పనులను భర్తే చూసుకున్నాడు. ఆమెకు తన ఇల్లేమిటో, తన పొలమేమిటో! 'నాంపెల్లి గుట్ట' దాటితే వచ్చేది వేరే దేశమే. ఆ గుట్టకైనా ఎప్పుడో చిన్నప్పుడు లీలగా గుడికి పోయిన గుర్తు. ఏడాదికోసారి ఊరికి వచ్చి కథలు చెప్పిపోయేవాళ్లు, నాటకాలు ఆడటానికి వచ్చేవాళ్లు మాత్రమే ఆమెకు తెలిసిన వేరే మనుషులు. వాళ్లయినా ఆ గుట్టను ఎట్లా దాటి వస్తారన్నది ఆమెకు అబ్బురమే.

ఎన్నడూ ఊరు దాటని రాధవ్వకు ఉన్నట్టుండి తిర్పతి చూడాలన్న బుద్ధి పుట్టింది. ఏ కథలు చెప్పేవాళ్ల నోళ్లల్లో నుంచో రాలిపడి ఆమెను ఆకట్టుకున్న మాట కావొచ్చది. కాటికి కాళ్లు చాపుకున్న వయసులో కొంత పుణ్యం సంపాదించుకోవాలన్న కోరికెనో! సరిగ్గా అలాంటి రోజుల్లోనే ఏదో 'దేశం' నుంచి ఎవరో మనిషి వాళ్ల ఊరొచ్చాడు. తీర్థయాత్రలు చేపిస్తామనీ, ఇన్ని రోజుల ప్రయాణమనీ, ఫలానా ఫలానా ఊళ్లుంటాయనీ, ఇంత సొమ్ము అవుతుందనీ, ఫలానా తారీఖులోగా తాను తిరిగి వచ్చినప్పుడు వచ్చేవాళ్లు పేర్లు రాయించుకోవాలనీ జనం గుమికూడిన చోటల్లా చెప్పాడు; ఆయన చెప్పిన చోటల్లా జనం గుమికూడి విన్నారు. ఎంతో తటపటాయింపు తర్వాత రాధవ్వ ఆ మనిషిని అడిగిన ఒకే ఒక్క ప్రశ్న, 'ఆ తిర్పతిల గూడా మనసొంటి మనుషులే ఉంటరా,' అన్నదే.

బయటి దేశం వాళ్లను నమ్మే రోజులు కావు. పైగా ఊరినుంచి ఎవరూ పోవడం లేదు. కానీ రాధవ్వ తన పట్టు విడవలేదు. ఒక్కదాన్ని అంత దూరం ఎట్లా తోలీయడం అనే భయం ఉంది. తర్వాత నలుగురం కలిసిపోతే బాగుంటుంది అనుకున్నారు. కానీ రూపాయల సమస్య ఒకటి ఉండనే ఉంది. పైగా పొలానికి నీళ్లు పెట్టడం, బర్ల పాలు పిండటం నుంచి ఆ పది పన్నెండు రోజుల్లో చేయాల్సిన నూరు పనులు గుర్తొచ్చాయి. ముందు ఇది చిన్న విషయంగానే అనిపించింది. కానీ ఏయే పనులు ఎందరికని చూసుకొమ్మని చెప్పాలి! ఒక రైతు తన పనుల నుంచి విరామం తీసుకోవడం ఎంత కష్టమో! దాంతో తల్లీకూతుళ్లను పొమ్మన్నాడు 'సత్తయ్య', బిడ్డ ఉంటే ఇంత ఇంట్లో దీపమైనా పెడుతుందని. కానీ తీరా ప్రయాణం రేపు మాపనంగ భాగ్యవ్వ బయటుంది. అట్లాంటి మనిషి దేవుడి దగ్గరికి ఎట్లా పోతుంది?

అదిగో అలాంటి సందర్భంలో ఊరు ఊరంతా చిత్రపడేట్టుగా రాధవ్వ, సత్తయ్య కలిసి బయలుదేరారు. (ఇట్లా తాపకో పేరు మార్చినందుకు ఆ 'ఏజెంటు' కోప్పడ్డాడు కూడా.) సత్తయ్య ఎప్పుడైనా 'అత్తా' అని తన నోటితో పిలిచాడని చెప్పలేం. అంత అవసరమైతే వాళ్ల మధ్య వారధిగా భాగ్యవ్వ ఉండనే ఉంది. ఆ రోజులు అలాంటివి. ఇద్దరూ తేరిపార ముఖాలు చూసుకుని మాట్లాడుకోవడానికి కూడా బిడియపడతారు కదా, అలాంటి అత్తా అల్లుడూ కలిసి ఎలా ప్రయాణం చేస్తారన్న సందేహమే ఊరివాళ్ల ఆశ్చర్యానికి కారణం. దీనివల్ల కూడా ఆ యాత్రకు ఒక ప్రత్యేకత వచ్చింది.

రాటు కొట్టడం అయిన సత్తయ్య నాగలి కట్టడానికి దాన్ని ఎడ్ల దగ్గరికి ఎత్తుకొస్తున్నప్పుడు పక్క పొలం నారాయణ కేకేశాడు, 'ఎడ్డోడా,' అంటూ. మీ అత్త వచ్చిందన్నాడు. సత్తయ్యకు వినబడింది, కానీ అర్థం కాలేదు. ఆ మనిషి మళ్లీ అంతే గట్టిగా చెప్పాడు. మాటలుగా వినబడుతున్నది మనసు స్వీకరించనట్టుగా ఇంకా అస్పష్టంగానే ఉంది. ఆ మనిషి దగ్గరికే పోదామన్నట్టుగా భుజాన ఉన్న నాగలిని అక్కడే విప్పచెట్టుకు ఒరిగిస్తున్నప్పుడు నారాయణ యాష్టతో కూడిన నవ్వులాటతో, 'నువ్వు తిర్పతిల ఇడిశిపెట్టచ్చిన మీ అత్తచ్చిందిరా,' అన్నాడు. సత్తయ్యను ఆ మాట ముల్లుకట్టెతో గుచ్చినట్టయింది. ఏ పుండు మానాలని అనుకున్నాడో దానిమీదే పొడిచాడు నారాయణ. ఏం చేయాలో తెలియని సత్తయ్య అక్కడే ఒడ్డుమీద కూలబడ్డాడు. ఈ నాలుగేళ్లలో ఎందరో నారాయణలు అన్న ఎన్నో ఎత్తిపొడుపు మాటలను సత్తయ్య ఎదుర్కున్నాడు. కాబట్టి ఈ ఒక్కమాటకు ఆయనేమీ కిందమీద అయిపోలేదు. కానీ అత్తను మళ్లీ ఎదుర్కోవడం అనే పరిస్థితికి ఎలా సంసిద్ధుడవాలో తోచలేదు. మనసులో ఏదో మూలకు తోసిన సిగ్గు, అవమాన భావనలు మళ్లీ కమ్ముకున్నాయి. నిజానికి తను ఏమీ చేయలేదు. ఏమీ చేయకపోవడం కూడా ఒక్కోసారి చేసినట్టుగానే లెక్కకొస్తుంది. కానీ తెలియకుండా మోస్తున్న ఏదో బరువును ఎవరో కాసేపు పక్కకు పెట్టినట్టయింది; తను చేసిన 'పని' వల్ల జరిగిన విపరిణామం ఎట్టకేలకు 'సుఖాంతం' అయినట్టుగా. లెంక పెట్టి వున్న ఎడ్లు అలుపు తీర్చు కుంటున్నట్టుగా కదలకుండా నిలబడి ఉన్నాయి. నీళ్లు నిండిన పొలంలో ఉదయపు ఎండ పడుతుండటం వల్ల గాలికి చిన్న అలలు మెరుపు ఊగులూగుతున్నాయి. ఆ కొద్దిసేపే నాలుగేళ్ల తర్వాత సత్తయ్య అనుభవించిన శాంతి.

రాధవ్వ అవతారాన్ని చూసి దగ్గరికి రావడానికి జంకుతున్న బిడ్డను మంద లించి, భాగ్యవ్వ చేసిన మొదటిపని ముట్టించిన పొయ్యిమీద ముందు కుండలో నీళ్లు కాగబెట్టి, తల్లికి నెత్తికి పోయడం. ఒంటికి అంటిన వాసనలను పోగొట్టడానికి

చేతనైనంత రుద్దింది. జడలు గట్టిన తల చిక్కులు తీసింది. పొడి చీర కట్టిచ్చి దిష్టి తీసింది. తల్లి బొడ్డుసంచిలో ఉన్న గుప్పెడు చిల్లర పైసలను తీసి, దాన్నీ, విడిచిన మురికి చిరుగుల చీరనూ పెంటబొందలో పారేసింది. ఇవ్వాళ పోశవ్వ తల్లికి కల్లు పోసి, కోడి కోయాలనుకుంది.

ఒంట్లోకి వచ్చిన కొత్త తేలికదనంతో రాధవ్వ ఇల్లంతా కలియదిరిగింది. మనవరాలు పెద్దమనిషి అయిందని తెలుసుకుని దీవెనలిచ్చింది. ఆమెను మాట్లాడించడానికి రానివాళ్లు పాపాత్ములు. అందరినీ దగ్గరికి తీసుకుంది. వాళ్లేడిస్తే ఏడ్చింది. మళ్లీ తనే పెద్దరికంతో ఊకుంచింది. ఆ నాలుగేళ్ల కథను ఎవరితో వీలైనంతగా వారికి చెప్పింది. విన్న తర్వాత మళ్లీ వాళ్లు కన్నీళ్లు పెట్టుకోవడం, ఈమె ఓదార్చడం, దేవుడి దయవల్లే ఇంటికైతే చేరిందన్న ముగింపుకు రావడం...

ఒక్కోసారి సత్తయ్యే తను చేసింది నమ్మలేడు. ఇంకెవరైనా అట్లా ఎట్లా జరుగుతుందనే అడుగుతారు. కానీ జరిగింది. అది నిజం. మిగిలినదంతా మాయ. తను అంత వెర్రోడా? అసలు ఎట్లా జరగనిచ్చాడు? అసలు భూమ్మీద ఎవరైనా అట్లా జరగనిస్తారా? యాత్రలకని బయలుదేరిన బస్సు ఒక్కొక్క ఊరిని దాటు కుంటూ తిరుపతిలో దర్శనం చేయించింది. దాని తర్వాత మైసూరుకు పోతుం దన్నారు. ఆ మధ్యలో ఎక్కడో కాసేపు విశ్రాంతి కోసం బస్సులు నిలిపారు. ఒకటి కాదు, చాలా బస్సులు. చాలామంది మనుషులు. తెలిసినట్టనిపించే తెలియని మనుషులు. అంతా చిట్టడివిలా ఉంది. గోలగోలగా ఉంది. అన్నీ సర్కారు ముళ్ల చెట్లు. ఇవొక్కటే సత్తయ్యకు బలంగా గుర్తున్నాయి. ఆపిన కొద్దిసేపటికి తిరిగి ఎక్క మన్నట్టుగా బస్సుల హారన్లు మోగాయి. అంతా మోత. ఆ రంగురంగుల బస్సుల్లో తనదేదో గట్టిగా గుర్తుంచుకుని సత్తయ్య బస్సెక్కాడు. అత్త రాలేదు. చెట్ల చాటుకు ఒంటేలుకు ఏమైనా పోయిందేమో అనుకున్నాడు. హారన్లు మోగుతూనే ఉన్నాయి. వస్తుందిలే అన్న నమ్మకం ఉన్నంతవరకూ మామూలుగా ఉన్నాడు. ఆ వ్యవధి దాటిపోయినంక ఆగం మొదలైంది. కిటికీలోంచి తల బయటికి పెట్టి చూశాడు. దిగి చూశాడు. పొరపాటున సీటు మారి కూర్చున్నదేమో అని తిరిగి ఎక్కి బస్సంతా కలియజూశాడు. ఎక్కడా కనబడలేదు. హారన్లు, చివరి పిలుపులు, రావాలి రావాలి, ఇంకెంతసేపని జనాల గోల, అయోమయం, తెలియనితనం, బస్సు కదులుతోంది, ఆపమని చెబుతున్నాడు, ముందున్న డ్రైవరుకు చేతులు ఊపుతున్నాడు, ఇంకో బస్సులో ఏమైనా ఎక్కిందేమో అని ఇంకెవరో అంటున్నారు, ఎక్కిందా, నమ్మకమేనా, ఎక్కకుండా ఎందుకుంటుంది, అత్తమీద కోపమొస్తోంది, ఆపమని గట్టిగా అనలేక

పోతున్నాడు, తొందర పెడుతున్నారు, మా అత్త రాకుండా బస్సును కదలనివ్వను అనడానికి నోరు పెగలడం లేదు, బస్సులు కదులుతున్నాయి, నోరు ఎత్తడానికి కూడా వణికిస్తున్నట్టుగా హారన్లు, డ్రైవరు భయపెడుతున్నాడు, క్లీనరు భయపెడుతున్నాడు, చుట్టున్న ప్రయాణీకులు భయపెడుతున్నారు, ఆ క్షణం జారిపోతోంది, అయ్యో అయ్యో బస్సు కదులుతోంది, గుండె జారిపోతోంది, తన చేతుల్లో ఉన్నది జారవిడుస్తున్నానని తెలుస్తూనే దాన్ని నిలుపుకోలేకపోతున్నాడు, ఆ ఒక్క క్షణం, నిలబడాల్సిన సమయంలో, నిలబడాల్సిన చోట గట్టిగా నిలబడకపోవడం వల్ల, అత్యవసరమైన సందర్భంలో కూడా నోరు ఎత్తలేకపోవడం వల్ల, లోకాన్ని ఎదుర్కోవడానికి కావాల్సిన ధైర్యం లేకపోవడం వల్ల, అయ్యయ్యో బస్సు కదులుతోంది, క..దు..లు..తోం..ది, క...ది...లిం...

తల్లి లేకుండా తిరిగివచ్చిన సత్తయ్యను భాగ్యవ్వ తిట్టిపోసింది, శాపనార్థాలు పెట్టింది. పెద్ద తప్పు జరిగిందని తెలుసు, కానీ చెప్పడానికి సమాధానం లేదు. భార్య ఒక్కతే నిజమైన అక్కెర ఉన్నది కావొచ్చు, అయినంత మాత్రాన లోకం అడగకుండా ఉంటుందా? అత్త కాబట్టే పట్టనట్టు ఉన్నాడన్నారు. సొంత బిడ్డ అయితే విడిచిపెట్టి వచ్చేవాడా అని ప్రశ్నించారు. అంత తెలివి లేదేమిరా అన్నారు. నల్లమొఖపోడా అన్నారు. నల్లికుట్లోడు అని తిట్టారు. ముఖం మీద ఉంచుడు ఒక్కటే తక్కువ. తనలో ఏ విషమూ లేదని ఎవరినీ నమ్మించలేడు. తనకూ కొంత తెలివి ఉన్నదని అసలు ఒప్పించలేడు. చూస్తుండగా 'ఎడ్డి సత్తయ్య' అన్న పేరు లోకం ఆయనకు కిరీటంగా పెట్టేసింది.

ఆ పేరును చెరుపుకోవడం కోసం సత్తయ్య ప్రయత్నించలేదు. అదే తనకు నిజమైన శాస్తి అనుకున్నాడు. అయితే అత్తను వెతకడానికి తన శక్తి మేరకు ప్రయత్నించాడు. ఒక పెద్దమనిషిని పట్టుకొని పోలీస్ థానాలో ఫిర్యాదు చేశాడు, ఆ తప్పిపోయిన చోటు అనుకున్న చోటుకు మళ్లీ వెళ్లారు, అక్కడ మన మాట మాట్లాడేవాళ్లు లేరు, వీళ్లకు తోచినట్టుగా చెప్పారు, వాళ్లు చెప్పిందేదో విన్నారు, అక్కడి పత్రికలో ప్రకటన ఇవ్వాలంటే ఇచ్చారు, వృథాప్రయాస అని తెలుస్తూనే ఉంది, అయినా చేయగలిగింది చేసి ఉత్త చేతులతో తిరిగొచ్చారు. భార్య కొన్ని రోజులు మాట్లాడలేదు. అంతకుముందున్నదేదో ఆ ఊళ్లో తను కోల్పోయాడు. దాంతో కేవలం పనిలో పడి బతికేశాడు. ఇంకే వ్యవహారంలోనూ తలదూర్చడానికి

తనకు అర్హత లేదన్నట్టుగా ఉండిపోయాడు. ఒక్క మాట ఎక్కువ మాట్లాడినా తన ఎడ్డితనాన్ని ఎత్తి చూపడానికి లోకం సదా సిద్ధంగా ఉండేది.

రాధవ్వ చెప్పింది విన్న ఊరు కలకలా అంది. 'బాస' రాదు, ఊరి జాడ చెప్పలేదు. నాంపల్లి గుట్ట దగ్గర తన ఊరు అన్న ఒక్క ముక్క తప్ప ఇంకేమీ తెలియదు. అది ఎవరికీ అర్థంకాదు. తప్పిపోయిన అని అర్థమయ్యేసరికి తన బొడ్డు సంచిలో ఉన్న ఆ కొన్ని పైసలు ఎవరో కొట్టేశారు. ఒకసారి నడుస్తూ పడిపోతే కాలు విరిగింది. సడాకు పక్కన పడివున్న ఆమెను ఎవరో ఎత్తుకెళ్లి సర్కారు దవాఖానాలో పడేశారు. అక్కడ ఎన్నిరోజులుందో తెలీదు. బాగైన తర్వాత ఈమె పదే పదే 'నాంపెల్లి గుట్ట దగ్గర' అని చెప్తుండటం వల్ల హైదరాబాద్‌లో నాంపల్లి అనేది ఒకటుందని తెలిసిన దయగల కన్నడిగుడు ఎవరో ఆమెను ఆ రైలు ఎక్కించేశాడు. కానీ అది ఆమెకు తెలిసిన నాంపల్లి కాదు; అక్కడ ఏ గుట్టా లేదు. అది మహానగరం. అక్కడ ఎవరూ ఆమెకు తెలీదు. తన నోటిలో ఉన్న ఒకే ఒక్క ముక్క ఆమెను అక్కడికి తెచ్చిపడేసింది. ఇంక దాన్ని దాటి ముందుకు పోవడానికి కావాల్సిన మరోమాట నోట్లో లేదు. తన జీవితకాలంలో ఆమెకు ఆ రెండో మాటతో అవసరం పడలేదు. ఆ అవసరం వచ్చిన రోజున ఆమె ఆ జనసంద్రంలో ఒంటిగా నిలబడిపోయింది.

భూమ్మీద కొన్ని కాకతాళీయ ఘటనలు జరగడం ఆ రాధవ్వ నమ్మే భగవంతుడి లీలే కావొచ్చు. ఉత్తర తెలంగాణ పల్లెల నుంచి 'దేశం పోవడం' మొదలైన కొత్తలో వాళ్ల ఊరి నుంచి 'మస్కట్' పోతున్న ఒకాయనెవరో సరిగ్గా ఆ నాంపల్లి రైల్వే స్టేషన్లో దిగాడు. అక్కడ మాసిపోయిన బట్టల్లో బిచ్చగాళ్ల వరుసలో కూర్చుని అడుక్కుంటున్న ఆమెను గుర్తుపట్టాడు. 'అయ్యో రాధవ్వా! నీకీ గతి పట్టిందా,' అని నీళ్లు నీళ్లయిపోయాడు. ఆయన చేసిన ఏర్పాటు వల్లే ఆమె తిరిగి ఊరికి రాగలిగింది.

వేములవాడ పక్కనుంటుంది ఈ నాంపల్లి గుట్ట. ఆ దగ్గరిలోని చిన్న పల్లెటూరు మాది. ఎప్పుడో చిన్నతనంలో ఆ ఊరికి దూరమయ్యాను. ఇప్పుడు అక్కడ మాకు సంబంధించినది ఏమీలేదు. కానీ నేను అక్కడ గడిపిన చిన్నతనం, అప్పుడు విన్న గాథల ఆలంబనగా మా ప్రాంతాన్ని నా మనసులో బతికించు కుంటాను.

ఆ రాధవ్వ తప్పిపోయిన అదే మహానగరంలో నేను కూడా చాలాసార్లు తప్పి పోయి తిరుగుతుంటాను. భాష వచ్చినా పనికిరాదు. తెలిసినట్టనిపించినా మనుషులు ఎన్నడూ తెలియరు. అదే నాంపల్లి రైల్వేస్టేషన్‌కు పోయి, ఎక్కడ రాధవ్వ కూర్చుని

వుంటుందా అని ఆ తావు కోసం వెతుకుతాను. ఆమెను తిరిగి పుట్టినింటికి చేర్చిన అలాంటి మనిషి ఎవరైనా నాక్కూడా తారసపడతాడా అని ఎదురుచూస్తాను.

తిరిగి వచ్చిన తర్వాత రాధవ్వ ఐదారేళ్లు బతికిందట. తర్వాత సత్తయ్య కూడా కాలం చేశాడు. ఏదో ఒక సమయంలో తన పాపప్రక్షాళన కోసం సత్తయ్య ఆమె కాళ్లమీద పడే వుంటాడని నా నమ్మకం. లోకం చాలా విషయాలు చెప్పదు. కొన్నింటిని ఒప్పుకోదు. అత్త, అల్లుడు మాట్లాడుకోవడమే మావైపు ఒకప్పుడు అలిఖిత నిషేధం. అత్త కాళ్లమీద అల్లుడు పడటం అనేది అసలు జరిగే విషయం కాదు. అది దాదాపుగా తలను నరుక్కోవడంలాంటిదే. కానీ ఆ ఎడ్డి సత్తయ్య తన తలను అత్త ముందు నరికిపెట్టి వుంటాడనే నాకు అనిపిస్తూ ఉంటుంది. ఆ రాధవ్వ కూడా ఆయన్ని కొడుకులా దీవించి క్షమించడానికే ఆ ఇంటికి తిరిగి వచ్చి వుంటుందని కూడా నేను అనుకుంటాను. అసలు ఇవేవీ లేకుండా అతి మామూలుగానే బతికేశారో!

కాలం గడిచేకొద్దీ సంఘటనలు వాటి అసలు రూపును కోల్పోతాయి. అందులోని తీవ్రతను తగ్గించుకుంటాయి. అందుకే కాబోలు, మొగుడు చేసిన ఘనకార్యం గురించి తన చివరి రోజుల్లో భాగ్యవ్వ నవ్వులాటగా చెప్పేదట. అందుకే అవి జరిగినప్పుడు మాత్రమే సంపూర్ణ నిజం. తర్వాత మనకు బదిలీ అయివచ్చేది కేవలం సారం పోయిన పిప్పి.

అప్పుడప్పుడు నాకు ఆ రైలెక్కించిన కన్నడాయన గుర్తొస్తాడు. ఆ వెనకే ఆ దొంగ గుర్తొస్తాడు. ఆమె తోవలో పడి వున్నప్పుడు మొదటగా చూసిన మనిషినీ, ఆమెను దవాఖానాకు చేర్చిన మనిషినీ, ఈ రెండూ ఒకరే కూడా కావొచ్చు, వాళ్లను గుర్తుకు తెచ్చుకుంటాను. అక్కడ కట్టు కట్టిన డాక్టరూ, ఆయన వెంబడి ఉన్నవాళ్లూ, ఆమెకు అక్కడ బ్రెడ్డో, పాలో ఇచ్చినవాళ్లూ, ఆమెకు తోవ చెప్పడానికి ప్రయత్నించిన వాళ్లూ, ఆమె చెప్పేది అర్థంకాక అయ్యో అనుకున్నవాళ్లూ వీళ్లందరూ ఎవరై ఉంటారని అనిపిస్తుంది. ఆ నాలుగేండ్లూ ఆమె బతకడానికి ఒక పైసా దానం చేసినవాళ్లు గుర్తొస్తారు. ఆ పదులకొలదీ ముఖాల్ని నేను ఊహించుకోవడానికి ప్రయత్నిస్తాను. ఆ కాలంలో ఎవరో ఒకరు ఆమెకు పరిచయం అయివుంటారు కదా, వాళ్లెవరయి ఉంటారు, ఏం మాట్లాడుకుని ఉంటారని ఊహించే ప్రయత్నం చేస్తాను. కానీ అవెప్పుడూ సత్యంగా అనిపించవు. ఉత్త చెత్తకల్పనలా తోస్తాయి. ఆమెను గుర్తుపట్టి ఊరికి పంపిన మనిషి ఆ తోవన కాకుండా ఇంకోలా పోయి

వుంటే ఏం జరిగేదా అనుకుంటాను. అప్పుడు కూడా ఆమె తిరిగి రాగలిగేదా అని సందేహపడతాను. నాకంటే ముందు బతికిపోయిన అందరు మనుషుల్నీ కలవాలని అనిపిస్తుంది. మానవోద్వేగపు మహత్తర క్షణాలకు సాక్షీభూతంగా ఉండగలిగితే బాగుండనుకుంటాను.

ఇంకా నాకు సత్తయ్య గుర్తొస్తాడు. ఒక పరిస్థితంటూ వచ్చినప్పుడు నోరు ఎత్తలేని, దానికోసం నిలబడలేని సందర్భాలు గుర్తొస్తాయి. వాటివల్ల నేను ఎందరినో బాధపెట్టి వుంటాను. చేయగలిగింది చేయలేకపోయి ఉంటాను. నా జీవితంలో నేను కూడా ఎన్నిసార్లు అలా 'ఎడ్డి'గా ఉండిపోయానో కదా అని సిగ్గవుతుంటుంది. కాకపోతే సత్తయ్యకు పెట్టిన కిరీటం నాకు లోకం పెట్టలేదంతే.

*కొత్త కథ, మే 2022*

✻




**పూడూరి రాజిరెడ్డి** 11 సెప్టెంబర్ 1977న నర్సింగాపురం గ్రామం, రాజన్న సిరిసిల్లా జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ మరణ లేఖలు 2008లో సాక్షి ఫన్ డేలో అచ్చయ్యింది. 2017లో చింతకింది మల్లయ్య ముచ్చట కథాసంపుటి వెలువరించారు. ఒక వచన ఖండిక, ఆత్మ కథాత్మక వచనాన్ని ప్రచురించారు. మధుపం (ఒక మగవాడి ఫీలింగ్స్ 2009), రియాలిటీ చెక్ (కొన్ని ప్రదేశాలు, కొన్ని సమూహాల జ్ఞాపకాలు, 2013) పుస్తకాలు వెలువరించారు. సాక్షి దినపత్రికలో పనిచేస్తున్నారు.

*చిరునామా: సన్నాఫ్ రామిరెడ్డి, 3-37, నర్సింగాపురం*
*చందుర్తి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా 505 403*
*ఫోన్: 99123 47926* **poodoorirajireddy@gmail.com**